అటకెక్కిన యంత్రలక్ష్మి

- 2018 నుంచి నిలిచిన పథకం
- వ్యవసాయంలో కూలీల కొరత
- యాంత్రీకరణకు రైతుల మొగ్గు
- సబ్సిడీపై పరికరాలు అందజేత



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న రైతు

వ్యవసాయ సాగులో యాంత్రీకరణను ప్రోత్సహించి రైతులకు సాగు వ్యయం, శ్రమను తగ్గించాలనే ఉద్దేశ్యంతో ప్రవేశపెట్టిన యంత్రలక్ష్మి పథకం ఆరేళ్లుగా అమలుకు నోచుకోవడం లేదు. గతంలో వేలాది మంది రైతులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోగా కొద్ది మందికి మాత్రమే సబ్సిడీపై ట్రాక్టర్‌లు, ఇతర వ్యవసాయ పరికరాలు అందాయి. దీంతో అర్హులైన మరికొంత మంది రైతులు ఈ పథకం మళ్లీ ఎప్పుడు ప్రారంభమవుతుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

చిన్నకోడూరు(సిద్దిపేట): వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత రైతులను వేధిస్తోంది. దీంతో యాంత్రీకరణ వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రభుత్వం కూడా రైతుల ఇబ్బందులను దృష్టిపెట్టుకొని యాంత్రీకరణకు ప్రోత్సహిస్తోంది. గత ప్రభుత్వం 2014–15 ఆర్థిక సంవత్సరంలో యంత్రలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకంలో భారీ యంత్రాలైన వరి నాటుమిషన్‌లు, వరికోత యంత్రాలు, ట్రాక్టర్‌లు, గడ్డి చుట్టే యంత్రాలు, రోటవేటర్లు, దమ్ము చక్రాలు, కల్టివేటర్‌లు, నాగళ్లు, మినీ ట్రాక్టర్‌లు 50 శాతం సబ్సిడీపై రైతులకు అందించారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 95 శాతం సబ్సిడీపై అందించడంతో ఈ పథకానికి మంచి స్పందన వచ్చింది. చాలా మంది రైతులు యంత్రాల కొనుగోలుకు ఆసక్తి చూపారు. ఈ పథకంలో సిద్దిపేట జిల్లాలో 2018 వరకు మొత్తం 20,850 పనిముట్లను అందించినట్లు వ్యవసాయ శాఖ అధికారుల సమాచారం.

యాంత్రీకరణతో ప్రయోజనం

వ్యవసాయంలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం, యంత్రాల వాడకం పెంచడం ద్వారా రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయి. కూలీల కొరత అధికమవుతున్న దశలో యంత్రాల వినియోగంతో ఈ పరిస్థితులను అధిగమించవచ్చు. అధిక సబ్సిడీపై అందించడంతో రైతులంతా యాంత్రీకరణ వైపు మారడానికి అవకాశాలున్నాయి. ప్రస్తుతం యంత్రాలను కొనుగోలు చేయాలనుకునే రైతులు ఎక్కువ మొత్తం వెచ్చిస్తూ బహిరంగ మార్కెట్‌లో వివిధ రకాల పరికరాలను కొనుగోలు చేస్తున్నారు. దీంతో తమకు తలకు మించిన భారంగా తయారైందని వాపోతున్నారు. ప్రభుత్వం ఈ పథకాన్ని త్వరగా పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.



గడ్డి కట్టలు కట్టే యంత్రం

పనిముట్లనైనా అందించాలి



రైతులకు వ్యవసాయంలో అధికంగా ఉపయోగపడే స్ప్రేయర్లు, కల్టివేటర్, మినీ ట్రాక్టర్‌లు, టార్పాలిన్ కవర్లు, కలుపు తీసే పరికరాలు వంటి సూక్ష్మ సేద్య పరికరాలనైనా ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తే రైతులకు ఎంతగానో మేలు చేకూరుతుంది. వీటి కోసం ఎంతో మంది రైతులు ఎదురు చూస్తున్నారు.

– ఏలేటి రాజిరెడ్డి, రైతు, మాచాపూర్

ఆదేశాలు రాగానే..

యంత్రలక్ష్మి పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తాం. యంత్రాల వినియోగంతో అనేక ప్రయోజనాలు ఉండటంతో చాలా మంది రైతులు ఈ పథకం కోసం ఎదురు చూస్తున్నారు.

– జయంత్ కుమార్, ఏఓ, చిన్నకోడూరు

అందరూ కష్టపడి పనిచేయాలి

మంత్రి పొన్నం ప్రభాకర్



కోహెడలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కోహెడ(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం అందరూ కష్టపడి పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం శ్రీవేంకటేశ్వర గార్డెన్‌లో వివిధ గ్రామాలకు చెందిన ఎంపీటీసీ, మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీలో పనిచేసిన వారందరూ తిరిగి పార్టీలోకి రావడం సంతోషంగా ఉందన్నారు. పాత, కొత్త నేతలంతా వెలిచాల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. పార్టీ కోసం కష్టపడే వారిని విస్మరించనన్నారు. ఆర్థిక, రాజకీయ, సామాజికంగా పార్టీ కార్యకర్తలకు నాయకులకు అండగా ఉంటానన్నారు. మొదటి దశ ఎన్నికల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీలో భయం కనిపిస్తోందని, ఆయన తన స్థాయికి దిగజారి మాట్లాడుతున్నరన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సంపద అంతా ముస్లింలకు పంచుతారని విద్వేషాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ విద్యావ్యాప్తిలోను, ఉపాధి కల్పనలోను, పరిశ్రమల ఏర్పాటులోను బీజేపీ కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. దేశ సంపదను ఆదాని, అంబానీలకు దోచిపెట్టారన్నారు. బీజేపీలో ఓటమి భయం మొదలైందని, మంగళ సూత్రాలు గుంజుకుంటారని, హనుమాన్ చాలీసాలు చదవనివ్వరని దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. బండి సంజయ్ కరీంనగర్‌కు చేసిందేమిలేదన్నారు. మంగళ సూత్రాలు అమ్ముకొని నామినేషన్ వేశా అని చెప్పి, ఇప్పుడు రూ.కోట్లు సంపదించాడని ఘాటుగా విమర్శించారు. బీజేపీ బడుగు, బలహీన వర్గాలకు అన్యాయం జరిగే విధంగా వ్యవహరిస్తోందని, బీజేపీని గద్దె దించాలన్నారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి ఐదు వేల మెజార్టీ దాటాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నారాయణగౌడ్, మంజులారెడ్డి, దొమ్మాట జగన్‌రెడ్డి, ధర్మయ్య, సుధాకర్, శంకర్, తిరుపతి పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో పశ్నించే వ్యక్తికి ఓటెయ్యండి

సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): ఓట్లకోసం బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దేవుళ్లతో రాజకీయం చేస్తున్నాయని, ఆ పార్టీలను ఓడించి పార్లమెంట్‌లో ప్రశ్నించే సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని మర్రిముచ్చాల గ్రామంలో కార్యకర్తలతో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోసపూరిత హామీలు ఇస్తున్న పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలన్నారు. ప్రచారంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, సురేందర్ రెడ్డి, బాలరాజు, రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవుళ్ల అనుగ్రహంతో బాగుండాలి

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



హరీశ్‌రావును సన్మానిస్తున్న నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): దేవుళ్ల అనుగ్రహంతో అందరూ బాగుండాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నర్సాపూర్ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం, కుషాల్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ కార్యసిద్ధి బాలాంజనేయ స్వామి ఆలయాలను దర్శించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆ పార్టీలను తరిమి కొట్టాలి

గజ్వేల్‌రూరల్: మాయమాటలతో ఓట్లడిగేందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులను తరిమికొట్టాలని గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డికి మద్దతుగా ఆదివారం మండల పరిధి రిమ్మనగూడలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ పాలనలో కరెంట్ కష్టాలు

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



సింగన్నగూడ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి కోరారు. మండలంలోని కొక్కొండ, సింగన్నగూడ గ్రామాల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు జహంగీర్, నాయకులు, కార్యకర్తలతో కలసి ఆదివారం ఆయనకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలు భూటకమన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్ సమస్యలు, రైతులకు సాగునీటి కష్టాలు మొదలయ్యాయన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి మెదక్ ఎంపీ అభ్యర్థిని గెలిపించి పార్టీ అధినేత కేసీఆర్‌కు కానుకగా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డి, నాయకులు అర్జున్‌గౌడ్, అంజన్‌గౌడ్, గణేష్‌గుప్త, బంగ్ల గణేష్, చంద్రశేఖర్‌రెడ్డి, బాలకృష్ణ, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీ గెలుపు కోసం కృషి చేయండి

ఏఐసీసీ సెక్రటరీలు విష్ణు, రోహిత్‌చౌదరి



ఏఐసీసీ సెక్రటరీలు విష్ణు, రోహిత్ చౌదరికి స్వాగతం పలుకుతున్న నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఏఐసీసీ సెక్రటరీలు విష్ణు, రోహిత్‌చౌదరి అన్నారు. ఆదివారం కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తూ సిద్దిపేటలో కొద్దిసేపు ఆగారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయం సాధించే విధంగా కష్టపడాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసేందుకు సీట్లు సాధించాలని, అందుకు సమష్టిగా కృషి చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో అన్ని ఎంపీ సీట్లు కాంగ్రెస్ గెలుచుకుంటుందన్నారు. ఏఐసీసీ సెక్రటరీలను కలిసిన వారిలో పార్టీ రాష్ట్ర నాయకులు రడం కిరణ్‌కుమార్‌రావు, ఎన్‌ఎస్‌యూఐ జిల్లా ప్రధాన కార్యదర్శి సలావుద్దీన్ తదితరులు ఉన్నారు.

ప్రశ్నించే గొంతును గెలిపించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత

మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత

హుస్నాబాద్: పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతు కోసం కరీంనగర్ బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత కోరారు. ఆదివారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరీంనగర్ పార్లమెంట్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే వినోద్ కుమార్‌ను గెలిపించాలని కోరారు. ప్రచారంలో కౌన్సిలర్లు పెరుక భాగ్యరెడ్డి, వాల సుప్రజ, గోవిందు రవి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ మాజీ చైర్మన్ సుద్దాల చంద్రయ్య పాల్గొన్నారు.

బండికి మద్దతుగా ఎన్నికల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నియోజకవర్గ ప్రభారి జయశ్రీ

బెజ్జంకి(సిద్దిపేట): కరీంనగర్ ఎంపీగా మరోసారి బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ కుమార్‌ను గెలిపించాలని మానకొండూర్ నియోజకవర్గ ప్రభారి బొమ్మ జయశ్రీ విజ్ఞప్తి చేశారు. మండలంలోని రేగులపల్లిలో ఆదివారం గడప గడపకు తిరిగి బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామగ్రామాన బీజేపీకి ప్రజలు అండగా నిలుస్తున్నారన్నారు. మోదీ చేపట్టిన ప్రజాహిత, దేశ రక్షణ చర్యలను వివరించారు.

గ్రామాల్లో బీజేపీ నాయకుల ప్రచారం

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్‌ను మరోసారి గెలిపించాలని కోరుతూ మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు గడప గడపకు తిరిగి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి మహిపాల్‌రెడ్డి, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలు, కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రవేశపెట్టనున్న పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ సన్నాహక సమావేశానికి హాజరై మాట్లాడారు. పేద విద్యార్థులకు ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. అదేవిధంగా మహిళలకు ఉచిత బస్సు, ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. మెదక్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ భారీ మెజారీటితో గెలిచే విధంగా అందరం కృషి చేద్దామన్నారు. కార్యక్రమంలో ఓబీసీ సెల్ జిల్లా చైర్మన్ డాక్టర్ సూర్యవర్మ, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కో–ఆర్డినేటర్ రాజు, ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కిండలవాడి సతీష్, ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ అధ్యక్షుడు బడికోల్ రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజలకు సేవ చేయడమే ట్రస్టు లక్ష్యం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట- భూంపల్లి మండల పరిధిలోని రామలింగేశ్వర ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం పీవీఆర్ ట్రస్టు వలంటీర్స్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి హాజరై మాట్లాడారు. పేద ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతోనే వెంకట్రామిరెడ్డి పేరు మీద పీవీఆర్ ట్రస్టు ఏర్పాటు చేశారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ ప్రతీ నియోజకర్గంలో ఫంక్షన్ హాల్ నిర్మిస్తానన్నారు. రూపాయికే ఫంక్షన్ హాల్, పేద విద్యార్థులకు ఉచితంగా ఫ్రీ కోచింగ్ ఉంటుందన్నారు. దానికయ్యే ఖర్చు తానే భరిస్తానన్నారు.

క్లుప్తంగా

గిరిజనుడిపై దాడి అమానుషం



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటస్వామి

హుస్నాబాద్: గిరిజనుడిపై అబ్కారీ శాఖ అధికారులు దాడి చేయడం అమానుషమని ఎమ్మార్పీఎస్ హుస్నాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాట్ల వెంకటస్వామి అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అబ్కారీ శాఖ అధికారులు ఇటీవల తరిగొప్పుల మండలం బొత్తలపల్లెకు చెందిన భూక్యా రవిని చిత్రహింసలకు గురి చేయడం సరికాదన్నారు. గుడుంబా తరలిస్తున్నారనే నెపంతో గిరిజనులను చిత్రహింసలకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దొరికితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. విచక్షణ మరిచి దాడులకు పాల్పడితే దళిత సంఘాల పక్షాన గిరిజనులకు మద్దతుగా ఆందోళన చేపడుతాని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొలుగూరి అశోక్, జన జాగృతి అధ్యక్షుడు ముక్కెర సంపత్ కుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి



లింగయ్య (ఫైల్)

బెజ్జంకి(సిద్దిపేట): బైక్ అదుపు తప్పి కిందపడి గాయపడ్డ సెంట్రింగ్ కార్మికుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం హైదరాబాద్‌లో మృతి చెందినట్లు ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. రాజన్న సిరిసిల్లా జిల్లా రేపాక గ్రామానికి చెందిన రణం లింగయ్య(41) సెంట్రింగ్ పనిచేస్తున్నాడు. అతడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈనెల 24వ తేదీన బెజ్జంకిలో సెంట్రింగ్ పని చేసి తిరిగి తన బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో మండలంలోని గుండారం శివారులో వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీఎస్‌పీ ఎన్నికల ప్రచారం

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్, మల్లుపల్లి గ్రామాల్లో ధర్మ సమాజ్ పార్టీ మెదక్ ఎంపీ అభ్యర్థి అన్నెల లక్ష్మణ్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చెప్పుల గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ర్యాగట్ల చందు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, మండల అధ్యక్షుడు దీపక్ రాజ్, అక్బర్‌పేట–భూంపల్లి మండల అధ్యక్షుడు కనక మల్లేశం, రాజేష్, సాయి, శ్రీకాంత్, దినేష్ పాల్గొన్నారు.

ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలి

గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి

ములుగు(గజ్వేల్): చెక్‌పోస్టు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా సరిహద్దు గ్రామమైన వంటిమామిడి రాజీవ్‌రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధారాలు లేకుండా నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే వస్తువులు, మాదకద్రవ్యాల రవాణా కాకుండా పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. రాత్రివేళ ప్రతీ వాహనాన్ని సిబ్బంది తనిఖీ చేయాలన్నారు.

నేత్రపర్వంగా విగ్రహ ప్రతిష్ఠ



అమ్మవారికి ఒడి బియ్యం సమర్పిస్తున్న మహిళా భక్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని ధర్మారంలో ఆదివారం శ్రీ మహంకాళి విగ్రహ ప్రతిష్ఠ నేత్రపర్వంగా జరిగింది. అమ్మవారికి మహిళా భక్తులు సామూహిక పూజలు నిర్వహించి, ఒడి బియ్యం సమర్పించారు. ఈ సందర్భంగా పురోహితుడు జయరామ శర్మ మాట్లాడుతూ అమ్మవారికి నిత్య పూజలు చేస్తే గ్రామం సుభిక్షంగా ఉంటుందన్నారు.

దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా రాములు

మిరుదొడ్డి(దుబ్బాక): బీజేపీ దళిత మోర్చా మండల అధ్యక్షుడిగా నక్కా రాములు నియమితులయ్యారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు ఎల్ముల దేవరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **కమాన్ నిర్మాణానికి శంకుస్థాపన**

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని అంగడిపేట హనుమాన్ దేవాలయ కమాన్ నిర్మాణానికి ఆదివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, కౌన్సిలర్ కూరాకుల శ్రీనివాస్, పురోహితులు చాడ నందబాలశర్మ, మురళీమోహనశర్మ, నవీన్‌శర్మ, విజయశర్మ, నాయకులు శంకరయ్య, శ్రీను, విజయ్, లక్ష్మణ్, శ్రీనివాస్, దామోదర్, ప్రవీణ్, ప్రభాకర్, రాము తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు**

జగదేవ్‌పూర్(గజ్వేల్): మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని బీఆర్‌ఎస్ జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల పరిధిలోని తీగుల్ నర్సాపూర్‌లో ఉన్న కొండపోచమ్మతల్లి, (శ్రీమునిబండ) శ్రీ కోదండ రామచంద్ర స్వామిలను ఆదివారం దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం జంగంరెడ్డిపల్లిలో పార్టీ నాయకులతో కలిసి బీఆర్‌ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామ్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచారంలో పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

◆ **బీజేపీ నాయకుల ప్రచారం**

తొగుట(దుబ్బాక): బీజేపీ మెదక్ అభ్యర్థి మాధవనేని రఘునందన్‌రావు విజయం ఖాయమని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో కార్యకర్తలతో కలిసి రఘునందన్‌రావుకు మద్దతుగా ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అభ్యర్థి కులం పేరుతో ఓట్లు అడగటం సిగ్గుచేటన్నారు. కులం పేరుతో రాజకీయం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి మల్లన్న సాగర్ నిర్వాసితులను మోసంచేసి ఓట్ల కోసం వస్తున్నాడని విమర్శించారు. మల్లన్న సాగర్ నిర్వాసితులకు పరిహారం చెల్లించకుండా చేసింది వెంకట్రామిరెడ్డి కాదాఅని ప్రశ్నించారు. ప్రచారంలో వెంకట్రావుపేట ఎంపీటీసీ కంకనాల నర్సింలు, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు చైతన్య, నాయకులు స్వామిరెడ్డి, నర్సింహారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

◆ **మృతుడి కుటుంబానికి చేయూత**

గజ్వేల్‌రూరల్: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి గ్రామస్తులు, యువకులు చేయూతనందించారు. మండల పరిధిలోని ధాతర్‌పల్లి గ్రామానికి చెందిన బాలయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా, అతడి భార్య గాయపడింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు, యువకులు ఆదివారం రూ.10,300 నగదు, బియ్యం అందజేశారు.

◆ **ఆ ఎంపీపీతో ఒరిగేదేమీ లేదు**

మిరుదొడ్డి(దుబ్బాక): బీఆర్‌ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన మిరుదొడ్డి ఎంపీపీ గజ్జెల సాయిలు, మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డితో ఒరిగేదేమీ లేదని వైస్ ఎంపీపీ పోలీస్ రాజులు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పార్టీని వీడినవారు తమ పదవులకు రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో మిరుదొడ్డి, ధర్మారం ఎంపీటీసీలు సుతారి నర్సింహులు, చెప్యాల శ్రీనివాస్, పీఏసీఎస్ మాజీ చైర్మన్‌లు సత్యనారాయణ, బాపురెడ్డి, మాజీ వైస్ చైర్మన్ మల్లేశం, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు తోట కమలాకర్‌రెడ్డి, జిల్లా నాయకుడు సూకూరి లింగం, సర్పంచుల ఫోరం మాజీ అధ్యక్షుడు తుమ్మల బాల్‌రాజు, మాజీ ఎంపీటీసీ గొట్టం బైరయ్య, లింగం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

◆ **కాంగ్రెస్ పార్టీని ఓడించండి**

కొమురవెల్లి(సిద్దిపేట): కుంభకోణాల కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఓడించాలని బీజేపీ మండల ఉపాధ్యక్షుడు శివారెడ్డి అన్నారు. ఆదివారం బీజేపీ భువనగిరి అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా మండలంలోని అయినాపూర్, గౌరయపల్లి, కొమురవెల్లి, మర్రిముచ్చాల గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

◆ **కాంగ్రెస్ హామీలపై అసత్య ప్రచారం**

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలపై బీఆర్‌ఎస్ నాయకులు అసత్య ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్ మండిపడ్డారు. బెజ్జంకిలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇప్పుడు విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. రేగులపల్లె శివారులో మాజీ ఎమ్మెల్యే తన కుమారుడి పేరిట కొన్న భూ విషయం మాట్లాడంలేదని, అందులో ఎక్కువ వున్న భూమి గురించి మాట్లాడితే తమ భూములు అసైన్డ్ అనడం సరికాదన్నారు. సమావేశంలో పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జెల్ల ప్రభాకర్, రాజు, ప్రవీణ్ పాల్గొన్నారు.